# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-09-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వర్షాలు, వరద పరిస్థితులకు అవసరమైన సహాయ సహకారాలను ఉభయ తెలుగు రాష్ట్రాలకు అందిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **వరద ప్రభావితులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్ లో 17 విపత్తు నిర్వాహక బృందాలు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాయని రాష్ట్ర హోం మంత్రి వి.అనిత తెలిపారు.**
4. **తెలంగాణలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయం కోసం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
5. **వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఈరోజు, రేపు విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**

==========================

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో చేపడుతున్న వరద సహాయ చర్యలను ముఖ్యమంత్రులు ప్రధానమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాలకు అవసరమైన సహాయం, సామగ్రిని అందజేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

--------------------------

వరద ప్రభావితులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారునిన్న విజయవాడలో నీట మునిగిన సింగ్‌నగర్, తదితర వరద ప్రాంతాలను ముఖ్యమంత్రి పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. విజయవాడ నగరంలో ఎప్పుడూ కురవనంత వర్షం కురిసిందని పేర్కొన్నారు. సింగ్‌నగర్ గండి పూడ్చడంపై అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి బుడమేరుకి ఊహించని స్థాయిలో వరద నీరు వచ్చినందున పరిసర ప్రాంతాలు ముంపుకు గురయ్యాయని తెలిపారు.విజయవాడలో వరద తగ్గే వరకు పరిస్థితిని పర్యవేక్షిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్ (41 సెకన్లు)

ఇలా ఉండగా గత అర్ధరాత్రి రెండోసారి సింగ్ నగర్‌లోని బుడమేరు ముంపు ప్రాంతాల్లో చంద్రబాబు నాయుడు పర్యటించి వరద బాధితులకు స్వయంగా ఆహారాన్ని అందించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంపు బారిన పడిన 294 గ్రామలకు చెందిన 13 వేల 227 మందిని పునరావాస కేంద్రాలకు తరిలించామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి. అనిత పేర్కొన్నారు. తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి ప్రస్తుత వరద పరిస్థితులపై మంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అధిక వర్షాల కారణంగా ఆయా జిల్లాల్లో 100 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ముంపు బాధితులను తరలించామన్నారు. ఆయా ప్రాంతాల్లో 61 వైద్య శిభిరాలను ఏర్పాటు చేసామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు భారీ వర్షాల కారణంగా 9 మంది మరణించారని తెలిపారు. 17 విపత్తు నిర్వాహక బృందాలు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాయని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఎడతెరిపిలేని వర్షాలతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. భారీ వర్షాలు, వరద ఉద్ధృతి కారణంగా ప్రభుత్వం ఈరోజు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆదేశాలు పాటించని ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈరోజు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివారం అర్ధరాత్రి కళింగపట్నం సమీపంలో తీరం దాటిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. తీరం దాటిన వాయుగుండం జగదల్‌పూర్‌కు ఆగ్నేయంగా 60 కిలోమీటర్లు, విశాఖకు వాయువ్యంగా 120 కి.మీ దూరంలో ఉందని. ఇది క్రమంగా దక్షిణ ఒడిశా- విదర్భ చేరుకుని బలహీనపడుతుందని తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు, రేపు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఎరుపురంగు హెచ్చరిక, ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాలకు నారింజ రంగు హెచ్చరిక జారీ చేసినట్టు ప్రకటించింది. ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, ఈరోజు, రేపు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని వాతావరణ కేంద్రం సూచించింది.

---------------------------

వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రోజు, రేపు కూడా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈరోజు అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ ఈ 9 జిల్లాలకు ఎరుపు రంగు హెచ్చరిక జారీ చేసింది. అలాగే మరో 12 జిల్లాలకు నారింజ రంగు హెచ్చరిక, 12 జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు వాతావరణ శాఖ జారీ చేసింది.

---------------------------

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ఎవరూ సెలవులు పెట్టొద్దని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు అధికారులతో నిన్న హైదరాబాద్లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి

మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయం కోసం చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. మంత్రులు, పార్లమెంట్, శాసన సభ, శాసనమండలి సభ్యులు సహాయక చర్యల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

-------------------------

తెలంగాణలో వర్షాలు భారీగా కురుస్తున్నాయని, భారీ వర్షాలు, వరదల కారణంగా నిన్నటి వరకు రాష్ట్రంలో 9 మంది మృతి చెందినట్లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నిన్న వర్షాల కారణంగా పలుచోట్ల రహదారులపై భారీగా వరద ప్రవహిస్తోందని చెప్పారు. వరద ఉన్నచోట ఎవరూ రోడ్డు దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలెవరూ బయటికి రావొద్దని మంత్రి సూచించారు.

-------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇప్పటికే 30కి పైగా రైళ్లను రద్దు కాగా... ప్రస్తుతం మరికొన్ని రైళ్లను అధికారులు రద్దు చేశారు. నాందేడ్-సంబల్‌పుర్ వెళ్లే నాగావళి ఎక్స్‌ప్రెస్‌తో పాటు మరికొన్ని రైళ్లు బాగా ఆలస్యంగా నడుస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కాకినాడ నుంచి తిరుపతికి వెళ్లే కాకినాడ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రాజమహేంద్రవరంలో నిలిపివేసి, రైలును రద్దు చేశారు. విశాఖపట్నం నుంచి కడప వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను కూడా రద్దు చేశారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వస్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను భీమవరం మీదుగా దారి మళ్లించారు. వర్షాలకు పట్టాలపై వరదనీరు చేరడంతో 15 రైళ్లను దారిమళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. మరి కొన్ని రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు.

-------------------------

ఇలా ఉండగా పలు రైళ్లు రద్దవడం, రాకపోకలకు అంతరాయం కలగడంతో సికింద్రాబాద్, విజయవాడతో పాటు పలు రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులకు రైల్వే అధికారులు స్టేషన్‌లో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. మరోవైపు రైల్వే సిబ్బంది ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. విజయవాడ డివిజన్ వ్యాప్తంగా ఈ పనులు కొనసాగుతున్నాయి. నిన్న, ఈరోజు కలిపి మొత్తం 80 రైళ్లు రద్దు చేయగా, మరో 48 రైళ్లను దారి మళ్లించారు. హైదరాబాద్- విజయవాడ మార్గంలోనే అత్యధిక రైళ్లు రద్దయ్యాయి.

-------------------------

విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ నుంచి 9.18లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ 70 గేట్లను ఎత్తి 9.18 లక్షల క్యూసెక్కులు, కాలువల ద్వారా 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద తీవ్రత పెరగడంతో కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని కృష్ణా నది లంక గ్రామాలు ఇప్పటికే నీట మునిగాయి. పులిగడ్డ, దక్షిణ చిరువోల్లంక, కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, ఆముదార్లంక, ఎడ్లంక తదితర గ్రామాల బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు.

=====================